# మిడిల్ క్లాస్

## అరిగె రామారావు

మాది మధ్యతరగతి కుటుంబం.

మిడిల్‌క్లాస్ ఫామ్లీ అంటారే-అదన్న మాట! మీదీ మధ్యతరగతి కుటుంబమే. ఆయన్దీ అదే! ఈయన్దీ అదే! ఇంకో ఆయన్దీ, మరింకో ఆయన్దీ అదే! వేలాది, లక్షలాది, కోట్లాది మధ్యతరగతి కుటుంబాలున్నాయి మనదేశంలో. అందులో మాదీ ఒకటి! అంటే-ఒక కాలు విరిగిన కుర్చీ; ఒక తాడు తెగిన వుట్టీ; ఇంకా చెప్పాలంటే వోటికుండ, గొర్రెతోకా, తుమ్మితే వూడే ముక్కూ... ఇలా ఎన్నో చెప్పుకోవచ్చు! ఎన్ని చెప్పుకున్నా, ఎంత చెప్పుకున్నా, ఎవరు చెప్పుకున్నా ఎన్నాళ్లుగా చెప్పుకున్నా ఇది తరగని కథ-మామూలు కథ-మాటి మాటికి మొదలయ్యే కథ. ఏళ్లు వెనక్కి పోతున్నా, దేశం ముందుకు పోతున్నా, పాలకులు మారుతున్నా శాసనాలు జరుగుతున్నా, ఇది మాత్రం మారని-మామూలు కథే!

కాకపోతే యింటికీ--యింటికీ కాస్త అటూ ఇటూ మారుతూ వుంటుంది. అలాగే ఒక యేడుకు మరో యేడుగూ కుడి ఎడంగా మారినా మారవచ్చు. దానికి రెడీమేడ్ దాఖలా ఏమిటంటే - నేను పోయిన సంవత్సరం కిర్సనాయిలుకోసం డబ్బా పుచ్చుకుని కొట్లముందు పడిగాపులు పడ్డాను. ఈ సంవత్సరం వేరుశనగనూనెకోసం డబ్బా పట్టుకుని పడిగాపులు పడుతున్నాను. దట్సాల్. అంతే తేడా! డబ్బా మారింది. రేపు వుప్పుకోసం జాతిచిప్ప పట్టుకుని నిలబడవచ్చు. అది వేరే సంగతి!

నేను వుద్యోగరీత్యా-ఎవరో కవి 'పసిడినాగరం' అన్నాడే-అదిగో ఆ నాగరంలో - భాగ్యనగరంలో - హైద్రా

బాద్• నగరంలో వుంటున్నాను ఏ నగంరలో వుంటున్నా మనందరి కథా ఒక్కటే అని నా వుద్దేశం! ఈ కథంతా చదివి మీరే అవునో, కాదో చెప్పాలి!

ఈ పసిడినాగరంలో ఒక బుడుపులో, ఒక వాడలో, ఒకానొక పాత మేడలో, మేడలోని చవుడుగోడల జమిలి గదుల పోర్షన్లో అద్దె కుంటున్నాము. ఈ వాడా, ఈ మేడా, ఈ చవుడు గోడలూ శాశ్వతం కాదు. వోనర్ లేక వోనరీ అద్దె పెంచితే మరో వాడకి పోతాం. అంటానికి తేలిగ్గానే అన్నాను. మరో వాడకి మేడకి పోవటం ఎంత కష్టమో తెలుసా? నేను ఆఫీసు కెళ్ళిన తర్వాత, భోజనాలూ అవీ చేసి మధ్యాహ్నప్పూట మా ఆవిడ ప్రక్కింటామెను (ఆమెకు ఏ మాటలు చెప్పి, ఎలా వుచ్చేసి వప్పిస్తుందో నాకయితే తెలియదు. అది మా ఆవిడ పని!) తోడు తీసికొని వాడ వాడా తిరగాలి. ప్రతి యింటిముందూ నిలబడి 'అద్దెకిచ్చే పోర్షన్లు ఏమన్నా వున్నాయా!' అని అడగాలి. ఆదివారాలు నేను అద్దెసైకిలు తీసికొని (పల్లీలు తింటూ) గల్లీలన్నీ తిరగాలి. ఆఫీసులో కోక్లర్క్సు, ముఖ్యంగా ప్యూన్సుకు చెప్పాలి–వాళ్ళ వాకూబులో పోర్షన్లు ఏమన్నా వున్నాయో చెప్పమని. పాచి పనిచేసే మనిషితో, పాలసైకిలు పోరడితో, గుడ్డలుతికే దోభీతో, పేపరేసే కుర్రాడితో రోడ్డులూడ్చే మనిషితో,



ఆఖరికి బిచ్చానికొచ్చే ముష్టి వెధవలతో సహా అందరికీ చెప్పుకోవాలి!

పైది అద్దె యిళ్ళ భాగోతం. ఇక యింటిలో భాగోతం పాపం; మా ఆవిడ నా మురికి గుడ్డలన్నీ వుతుకుతుంది. గుడ్డలన్నీ అంటే ఎన్ని! రెండు టెర్లిన్ షర్టులు, తన గుడ్డలూ మా యిద్దరి వెధవల మురికి నిక్కర్లూ, మురికి చొక్కాలు వుతుకుతుంది. ఈ కుళ్ళు గుడ్డల మురికి బాగా పోతుందని మా యిళ్ళదగ్గర వున్న ఒక సబ్బుల ఫాక్టరీకి వెళ్ళి బకెట్‌తో పది పైసల సబ్బు నీళ్లు కొనుక్కొని వస్తుంది. పని మనిషితో పోట్లాడుతుంది. అది నాగాలు పెట్టితే జీతంలో కోసుకుంటుంది. పాల వాడితో పేచీలు పడుతుంది. 'ఎగస్ట్రాల' లెక్కల్లో కాస్త వాడ్ని మోసం చేయటానికే ప్రయత్నిస్తుందని నా అనుమానం. (అనుమానమే సుమండీ!) మళ్ళీ మీరీ మాట ఆవిడ దగ్గర అనేరు! 'ఆ బుద్ధులన్నీ మీ వాళ్ళకే!' (అంటే మా అమ్మకు, అక్కయ్యలకు, వదినోళ్లకూ!) అని తెగ సాధిస్తుంది.

సాయంత్రంపూట ఇరుగు పొరుగమ్మలను వెంటేసుకుని శంకరమఠం దగ్గరకెళ్ళి గీచిగీచి బేరాలాడి, మొగ్గలడిగి కూరలు కొనుక్కొని వస్తుంది. వాడు తురకంలో తిట్టితే 'వెధవను నేను తెనుగులో తిట్టాలే!' అని నవ్వేసి, తనకు తాను సమాధానపడుతుంది

కూరల మార్కెట్ ప్రక్కన వున్న సెకెండ్‌హాండ్ పుస్తకాల షాపులోంచి అద్దెకు నవల్స్ తీసుకొస్తుంది. మధ్యాహ్నాలు వంటయింటికి గొళ్లెం పెట్టి ఆ అద్దె నవలలు చదువుతూ కూర్చుంటుంది. మా ఆవిడ వూరి కెళ్ళినప్పుడు సెక్స్ పుస్తకాలు అద్దెకు తెచ్చుకుని నేనూ చదువుతాననుకోండి!

మొదటి రెండు ఆదివారాలు నేను టిఫిన్‌బాక్స్ ఒకటి తీసుకుని మాంసం దుకాణానికి వెళ్లతాను. నెల చివరి రోజుల్లో యింట్లో వున్న పాత పేపర్లు అమ్మి కాలక్షేపం చేస్తాం. నాకు వచ్చే ముష్టి మూడొందల జీతం డబ్బులు ఈ హైదరాబాదు నగరంలో నెల చివరిదాకా వస్తాయా మరి? మా ఆవిడ ప్రక్కిళ్లకు చెంచాలూ, గిన్నెలూ, చేటలూ పట్టుకుని అప్పు కెళ్ళుతుంది. మా యింటికి బంధువు లెవరైనా వస్తే ఆఫీసులో చేబదుళ్ళు చేస్తాను. అవి పుట్టకపోతే ఆఫీసు ప్యూను దగ్గర వడ్డీలకు అప్పు తీసుకుంటాను. ఆ వచ్చిన బంధువులు తిరిగి వెళ్తుతూ పిల్లల చేతిలో పదీ పరకా పెడితే నేనూ, మా ఆవిడా కలసి ఆ పిల్ల వెధవలను అల్లించి బెల్లించి ఆ డబ్బులు కాస్తా కాజేస్తాం. వాటిని మరోవాటికి ఎడ్జస్ట్‌మెంట్.

మా ఆవిడ పుట్టింటి కెళ్ళి వస్తూ వాళ్ళమ్మనూ, చెల్లెళ్ళనూ అడిగి పాత చీరలూ, వోణీలూ గట్రా తీసుకొస్తుంది

వాటిని - స్టీల్ సామానువాళ్లకు పడేసి ఎ గిన్నో కొంటుంది (గుడ్డలు కాక పైన డబ్బులుగూడ ఇస్తుందేమోనని నా అనుమానం!) ఆ గిన్నెను అందరికీ చూపించి మురుసుకుంటుంది. ఒక్కొక్క సారి ఆ పాత చీరల్లో బాగున్న చీరను అట్టే పెట్టి తనే కట్టుకుంటుంది.

బయట చేరే రోజుల్లో కూడ యింట్లోనే వుంటుంది. అంతా కలి పేసుకుంటాం. ఎవరన్నా బంధువు లొస్తే మాత్రం ముఖ్యంగా మా అమ్మ వస్తే బుద్ధిగా మూల కూర్చుంటుంది. ఈ తేదీలూ అవి నాకు గుర్తుండి చావవు. కాబట్టి, ఎప్పుడన్నా నా మీద కోపంగా వుంటే 'దూరం బయటున్నా!' అంటుంది. వున్నా లేకపోయినా నమ్మా ల్సిందే!

ఇక రాత్రిళ్ళ ఈ పిల్ల వెధవలు యిద్దర్నీ నిద్రలు బుచ్చి మేమిద్దరమూ మాటామంతీ ఆడుకోవటానికి చేసే ప్రయత్నం-అదొక జాతర! ఎవ రైనా బంధువులొచ్చినప్పుడు ఈ రెండు గదుల కొంపలో రాత్రుళ్ళ పక్కల ఎరేంజ్‌మెంట్-అదొక సిగ్గుచచ్చే పని! వచ్చిన వాళ్ళల్లో జంటలూ-అందునా పడుచు జంట వుంటే మరీని మా ఆవిడ తెలివైనది! ఆ పర్మిటేషన్స్, కాంబి నేషన్స్ ఎలా చేస్తుందో ఏమిటో! మొత్తా నికి ముసిముసిగా నవ్వుతూ నా పక్క లోనికి వచ్చేసి, "వూఁ, జరగండి!" అంటుంది నా పక్క అంటే-అది ఆ వచ్చిన బంధువుల్ని బట్టి వుంటుంది. ఒక్కొక్కసారి ఆ పక్క వంటిల్లూ, వరండా, నూతిపళ్లెమూ, దొడ్లో జామి చెట్టు క్రిందా, కాదూ - మా పాత మంచమూ ... ఇలా మారిపోతూ వుంటుంది.

ఇలా ఎలాగో రోజులు నెట్టేస్తున్నాం. మీరూ ఇంతే అనుకుంటా! అదిగో, ఆయనా ఇంతే అనుకుంటా! ఇదిగో, ఈయనా అంతే అనుకుంటా.

ఇలా ఈ మిడిల్‌క్లాస్ ఫామిలీస్‌లో ఎన్నో సమస్యలు, మరెన్నో ఎడ్జస్ట్ మెంట్స్, ఎన్నింటికో రాజీపడాలి. ఎన్ని సరదాలకో సలాం కొట్టాలి. సరదా అంటే-అసలు విషయం గుర్తు కొచ్చింది. నాకు సినిమాలు చూడటం అంటే సరదా! గమ్మత్తుగా మా ఆవిడకీ ఈ సరదా వుంది. మా యిద్దరికీ వుంది కాబట్టి ఆటోమెటిక్‌గా మా యిద్దరు వెధవలకూ వచ్చేసింది.

అసలు మాట్లాడితే ఈ బ్లడీ మిడిల్ క్లాస్ గాడికి ఈ సినిమాలన్ను మించిన వినోదం, రిక్రియేషన్ ఏముంది? క్లబ్బు లకు పోలేడు. టెన్నిస్ ఆడలేడు. బ్రిడ్జ్ ఆడలేడు. కేబెరా డ్యాన్సులు చూడలేడు. కాసులుపోసి రేసులు ఆడ లేడు. మరింకేం చేయగలడు? సినిమా చూడగలడు. వచ్చే ప్రతి సినిమా చూడగలడా? చూడలేడు దానికికూడ

ఎడ్జస్ట్‌మెంట్ కావాలి అసలు సిన్మా అంటూ చూడటం మొదలుపెడితే ప్రతి సిన్మానూ చూడాలనిపిస్తుంది. మరది అసాధ్యమైన విషయం. కనీసం ప్రతి సిన్మాను గురించీ తెలుసుకోవాలని పిస్తుంది. దానికిగాను సినిమా పత్రికలు చదవాలి. వాటిల్లోనూ ఒక్కొక్క సిన్మాను గురించి ఒక్కొక్క 'రస పత్తర ఘట్టం' రాస్తుంటారు. మరి మిగతా 'రసవత్తర ఘట్టాల' సంగతి?

దానిగ్గాను మేం ఏంచేస్తున్నామంటే అదిగో మా ఆవిడ వచ్చేస్తోంది. అమ్మో చిటపటలాడుతోంది. చిందులు త్రొక్కుతోంది అసలే ఎర్రనయిన మొగం, కోపంతో మరీ ఎర్రనయింది. చేతిలోని కూరలసంచిని ఒక మూలకు గిరవాటేసింది.

"ఏమయింది ఇందూ!" భయం భయంగానే అడిగే.

"నా బొందయింది!"

మళ్ళీ తనే అంది: "నేనా రోజు చెప్పితే విన్నారా?"

"ఏ రోజు? ఏం చెప్పావు!"

"సెక్రెటరీ సిన్మా బాలాజీలోకి వస్తుంది. అందరం కలసి వెళ్దాం అంటే విన్నారా? రెండూ ముప్పయి తగలేసి ఒక్కరే వెళ్ళి ఆ సుదర్శన్‌లో చూచివచ్చారు"

నేను అమాయకంగా, ఆ రాత్రే నీకు కథంతా, చివరికి లవ్‌సీన్స్‌తోసహా చెప్పాను కదే?" అంటూ ఆ లవ్‌సీన్‌ను అభినయించటానికి మా ఆవిడ నడుం చుట్టూ చెయ్యేసి దగ్గరకు లాక్కొన్నాను.

విసిరికొట్టింది. "మీరు చూస్తే సరా! మేం చూడొద్దూ! అందులోకీ ఇది వాణిశ్రీ సిన్మా ఆయె!" అంది.

"ఇంతకీ ఇది బాలాజీలోకి వచ్చిందని ఎవరు అన్నారు?" మాట మార్చడానికి అన్నాను.

"శంకర్‌మఠం దగ్గర బోర్డ్ వేశారు!

ఇక్కడ చిన్న వివరణ అవసరం. ఈ వూళ్లో మనలాంటి మిడిల్‌క్లాస్‌గార్లు సిన్మాలు చూడ్డానికొక చిన్న సమ పాయం వుంది. ప్రతి క్రొత్త సిన్మా - పొరుగూర్నుంచి వచ్చిన బంధువులు తెల్సినవాళ్ళందరి యిళ్లకెళ్ళి పలకరించి వచ్చినట్లుగా - ప్రతి హాలులో కొన్నేసి రోజులు ఆడుతూ నగరం నాలుగు మూలల్ని పలకరించి పోతాయి. ఆ పలకరింపులో మేముంటున్న ఏరియాలో వున్న బాలాజీ, రహత్‌మహల్ లాంటి హాల్సుకి వచ్చిపోతాయి. ఈ హాల్సులో సిన్మా టికెట్ ఖరీదు తక్కువ, మనం వెళ్ళే క్లాస్ రూపాయి ఇరవై పైసలే! అదే ఆడవాళ్ళు ఒక్కరూ వెళ్ళితే అరవై పైసల కాబట్టి మేం ఈ హాల్స్‌కు క్రొత్త సినిమాలు 'పలకరింపుకు' ఎప్పుడొస్తాయానని కలవరిస్తూ కాసుకుని

కూర్చుంటాం. మిగతా హాళ్ళలో ఒక్క సినిమా చూచేది, ఈ హాళల్లో రెండు సినిమాలు చూడవచ్చు. కొన్ని క్రొత్త సినిమాలు నేరుగా ఈ హాళ్ళ లోనే రిలీజవుతాయి. అప్పుడు మాకు పండుగే! కాని, కొన్ని సినిమాలు డిమాండ్‌ను బట్టి, ఈ హాల్స్‌కి వచ్చే సరికి రెండు మూడు నెలలు కూడ పట్ట వచ్చు. అంతవరకు వోపిక పట్టలేక పోతే నేనో, మా ఆవిడో ఎవరో వెళ్ళి చూచి వస్తాం. —అలా చూచినవాళ్ళు రెండోవాళ్లకి సెన్సార్ సర్టిఫికేట్ దగ్గ ర్నుంచి, 'శుభం' దాకా పూస గ్రుచ్చి నట్లు, డైలాగ్స్ సహితం వల్లెవేస్తూ చెప్పాలి. అదీ షరతు! నేను ఇంటి దగ్గర వున్నట్లయితే పిల్లలకు అన్నాలు పెట్టటం, ఎంగిలి కంచాలు. కడగటం నా వంతు. ఈ మధ్యే మా పెద్దాడు కూడ తన 'దోస్తులు' తో కలసి సినిమాలు చూసి వస్తోన్నాడు. వాడూ మాకు కథ చెప్పాల్సిందే! వాడు చూచేవన్నీ స్టంట్ సినిమాలు. వాడయితే స్టంట్ కూడ చేసి చూపెడతాడు. వెధవది మ్యూజిక్‌ను కూడ నోటితో ఆలపించి వినిపిస్తాడు.

ఇలా సినిమా కథను చెప్పటం, చెప్పించుకోవటం మాకొక తియ్యటి అనుభవం!

అదెలాగో మనవి చేస్తాను—

'అడిగేవాడికి చెప్పేవాడు లోకువ', అన్నారు కాని, ఇక్కడ మాత్ర 'చెప్పేవారికి అడిగేవారు లోకువ!' నేను సినిమా కథ చెప్పే రోజున నేను మా యింటికి రాజును. అలాగే మా ఆవిడ ఒకరోజు రాణి అవుతుంది. (ప్రతి రోజూ వంటింటి మరియు పడకటింటి రాణీగూడ— అది వేరే విషయం.) మరో రోజు మా పెద్ద వెధవ "మాస్టర్ రాజు" అవుతాడు.

నేను కథ చెప్పే రోజున ఆ సాయంత్రం నుంచే పెద్ద పోజులు వేస్తాను, పెత్తనం చెలాయిస్తాను.

"ఇందూ, కాఫీ!"

"ఏం వళ్ళు ఎలా వుంది? ఇంతకు ముందేగా టీ తాగారు."

"ఇంతకుముందు టీ త్రాగితే, ఇప్పుడు కాఫీ త్రాగకూడదని వుందా? అయితే ఇవ్వాళ 'రాజు వెడలె'.. " అని చిన్న మ్యూజిక్ బిట్‌ను నోటితో ఆలపిస్తూ, దర్జాగా ఠీవిగా కాళ్లు వూపుతూ కూర్చుంటా.

నెత్తి కొట్టుకుంటూ "కర్మ, ఇదొకటి వుందిగా ఏంచేస్తా! తెస్తా —" అంటుంది.

ఆ సాయంత్రం ఈ వెధవలిద్దరిచేత పాత పాఠాలన్నీ శ్రద్ధగా చదివిం చేస్తా. వూఁ, ఆఁ - అంతే-వుందిగా- 'రాజు వెడలె-', నా మ్యూజిక్ బిట్ వచ్చినట్లు చదువుతారు. "అరేయ్, పాఠాలు చదవకపోతే నాన్న 'రాజు

వెడలె' సిన్మాకథ చెప్పడురా," అని వాళ్ళల్లో వాళ్ళు చెప్పుకుంటూ శ్రద్ధగా చదువుతారు

మా ఆవిడ తొందర తొందరగా పనులన్నీ చేసుకొని స్నానమదీ చేసి వస్తుంది. నా యిష్టాన్నిబట్టి మా ఆవిడ్ని లూజుగా చెవులమీదకు వచ్చేటట్లు జడ వేసుకోమంటా; లేకపోతే రెండు జడలు వేసుకోమంటా. అదీ కాకపోతే డిప్ప తగిలించుకొని కొప్పు పెట్టుకోమంటా. బొడ్డు క్రిందకు జార్చి చీర కట్టమంటా.

"ఇవన్నీ చేయటానికి నేనేం 'సాని పాపను' అనుకున్నారా?" అని కస్సున లేస్తుంది.

వెంటనే నేను "అయితే - 'రాజు వెడలె' – " అని దీర్ఘం తీస్తూ నా మ్యూజిక్ బిట్ ఎత్తుతా. 'ఇదొకటి వుందిగా' అని అంటూ నేను చెప్పినట్లు చేస్తుంది. ఆ పూట నేను ఏ వేషం వెయ్యమంటే ఆ వేషం వేస్తుంది.

తొందర తొందరగా మా అందరికీ అన్నాలు వడ్డించేస్తుంది. అన్నాల దగ్గర రోజూ కొట్టుకునే మా వెధవలు నోరు మూసుకుని తింటారు.. ఏమన్నా చేసారో, నా దగ్గర 'సిన్మాకథ' ఆయుధం వుందిగా? 'రాజు వెడలె' - మ్యూజిక్ బిట్! .

అన్నాలు అయ్యేక తొందరగా మంచాలు ఎక్కుతాం నలుగురం ఒకే మంచం పిల్లల్ని చెరొక ప్రక్క వేసుకుంటాం పిల్లలిద్దరు నా ప్రక్కనే పడుకుంటామని పేచీ పెట్టారనుకో – 'రాజు వెడలె'–మ్యూజిక్ బిట్ లైటార్పేస్తాం కిటికీలోంచి సన్నటి వెన్నెల వెలుగు లోపల పడుతూ వుంటుంది. మా ఆవిడ చెంపలు మెరుస్తూ వుంటాయి. మెడ క్రిందనుంచి, జుట్టులోంచి కమ్మటి పరిమళం, క్రొత్తవేషంలో (నేను వేయించిందే!) క్రొత్తగా కనిపిస్తుంది! దగ్గరకు లాక్కుంటూ చేతుల్లోకి పొదుముకుంటు ఆ సన్నటిచీకట్లో భయపడ్డ బల్లిలాగా నన్ను కర్చుకుంటుంది.

"అబ్బ, ఏంటి నాన్నా లేట్ వూం– స్టార్ట్ యువర్ స్టోరీ!" అంట్టాడు మా పెద్దాడు.

ఏంటో వాడికేం తెలుస్తుంది. ఆ చీకట్లోనే మా ఆవిడ నములుతున్న తాంబూలం కమ్మంతా నా నోట్లోకి ట్రాన్స్ఫర్ చెయ్యమని నాలికతో పోట్లాడుతా.

"ఛీ, పాడు!"

"అయితే సిన్మా కాన్సిల్!"—మ్యూజిక్ బిట్

"అబ్బ, మళ్ళీ ఏమయింది నాన్నా?" చిన్నాడు అసహనంగా అంటాడు

మా ఆవిడ రాజీకి వస్తుంది ఒకొక్కసారి కాళ్ళు వత్తమంటా "ఏం తీపడం నేనొత్త–" అంటుంది "అయితే నేను చెప్పా–" మ్యూజిక్ బిట్! పిల్లలు



అసహ్యంగా "వత్తమ్మా!" అంటారు. ఇలా రాజపోకిళ్లు పోతాను.

మా వెధవ ఈ ఆలస్యాన్ని భరించలేక టైటిల్స్ వాడే స్టార్ట్ చేస్తాడు.

"......ప్రొడక్షన్స్ సమర్పించు... నోటితో మ్యూజిక్ బిగిన్ చేస్తాడు.

"శోభన్‌బాబు - జయసుధ...... ఇలా మా రెండో వెధవ కాస్టింగ్స్ చెప్పేస్తాడు.

"చెప్పేది మీరూ - వినేది మేం!" అని మా ఆవిడ మునిపంటితో నా చెవి కొరికి కిలకిలా నవ్వేస్తుంది.

ఇక నేను చచ్చినట్లు చెప్పుతాను. కాలేజీలో చదివే రోజుల్లో నాకు నాటకానుభవం కాస్త ఏడ్చింది, కాబట్టి టైమింగ్ మాడ్యులేషన్, మన్నూ మశానం మషాలాలు చేర్చి, డైలాగ్స్‌ను పాత్రానుగుణంగా వల్లెవేస్తా. అలా

చెప్తుతున్నప్పుడు ఎప్పుడో వేసిన కాలేజీ నాటకానుభవం, సిన్మాలల్లో నటిం చాలనే (శాశ్వతంగా వాయిదాపడ్డ) మోజూ - సాకొక 'మూడ్' నిస్తాయి. ఆ మూడ్‌లో నేను ప్రతి బిట్టూ చాల ఇంటరెస్టింగ్‌గా చెప్తుతా. అందుకే మా ఆవిడా, పిల్లలూ నేను చెప్పే సిన్మా కథకోసం చెవి కోసుకుంటారు; సిన్మా చూడకపోయినా నేను చెప్పే కథ విని తృప్తిపడతారు.

సిన్మాలో లవ్‌సీన్స్ (రకరకాలఆల్బమ్ ఫోజులు అంటే సరిగ్గా వుంటుందేమో) చెప్పవల్సి వచ్చినప్పుడు—శోభన్‌బాబు జయసుధను ఇలా చేశాడు అలా చేశాడు అంటూ- ఆ కాసేపు నేను శోభన్‌బాబూ, మా ఆవిడ్ని జయసుధగా వూహించు కొంటు ప్రత్యక్ష వ్యాఖ్యానంతో చెప్తతా.

మా ఆవిడ నన్ను విదిలించికొట్టి, నా చేతుల్లోంచి విదిలించుకుని, "బాబూ మీ సిన్మాకథకూ, మీకూ ఒక దణ్ణం. నా వళ్ళు హూనం చేసేశారు" అని అంటుంది.


"మరిక్కడ ఒక సాంగ్ వుంది. పాడనా, చెప్పనా" —అని అడుగుతా.

"బాబూ, మీకొక దణ్ణం! పాడొద్దు. పాట తర్వాతది చెప్పండి," అని చేతులు జోడించి మరీ వేడుకుంటుంది. నేను నవ్వేసి పోన్లే పాపం అని వదిలేస్తా. కామెడీ చెప్తుతున్నప్పుడు పిల్లలిద్దరూ కడుపు చేత్తో పట్టుకుని పొట్ట చెక్క లయ్యేటట్లు నవ్వుతారు. వాళ్ళ నవ్వు చూస్తోంటే నా కడుపు నిండిపోతుంది.

మధ్య మధ్యలో వుండి వుండీ యిద్దరు వెధవల్లో ఒకడు చిటికెనవేలు చూపిస్తాడు. 'నాన్నా, నేనొచ్చేవరకు కథ చెప్పొద్దు!' అని మరీ మరీ హెచ్చ రించి బయటి కెళ్తాడు. బాత్‌రూం లోంచే మళ్ళీ "నాన్నోయ్, కథ చెప్ప వాకు!" అని గావుకేకలు పెడతాడు.

భయంకరమైన క్రైమ్ సన్నివేశాలను వినేవాళ్ల గుండెలు భయంతో బితుకు బితుకు మనేటట్లు ఆపి ఆపి, సాగదీస్తూ నోటితో మ్యూజిక్ వేస్తూ చెప్తుతా. మా ఆవిడ భయంతో నన్ను కర్చుకుంటుంది. "ఇక చాలు - మిగతాది చెప్పండి-" అంటుంది. మా పెద్దాడు, "కాదు అదే చెప్పు నాన్నా!" అంటాడు. మా ఆవిడ వాడి వీపుమీద ఒకట్టి తగిలించి, "వెధవా! వ్రేలెడు లేవు. ఇప్పట్నుంచే నీకు క్రైమ్ సీన్సా? పెద్దయితే రౌడీ వెధవ్వి అయ్యేటట్లున్నావు!" అని అంటుంది.

నేను సిగరెట్లు కాల్చుకోవాలను కున్నప్పుడు మ్యూజిక్ యిచ్చి, 'విశ్రాంతి' అని చెప్పేసి, 'ఆఁ—, చుట్టా బీడీ సిగరెట్—' "టీ, టీ," అని అంటూ లేచి లైటేసి సిగరెట్ వెలిగిస్తా. మా ఆవిడ కోపంగా, "ఎక్కడయినా ఇన్ని విశ్రాంతులుంటాయేంటీ!" అని దీర్ఘం తీస్తుంది. "ఇది బాగా పాతకాపీ.




కట్స్ చాలా వున్నాయి" అని సమర్థిస్తా.

ఇవన్నీ గుర్తుపెట్టకుని తను కథ చెప్పాల్సి వచ్చినప్పుడు రకరకాలుగా నన్నేడిపించుకుని తింటుంది. సగం చెప్పి, "మిగతా రీళ్ళు ఇంకా రాలేదు సార్!" అని వూరిస్తుంది. ప్రేమ సన్నివేశాలను సరిగ్గా చెప్పకుండా తేల్చి పారేస్తుంది. నేను తరచి తరచి వివరాలు అడిగితే, "సెన్సార్ కట్ చేసింది. ఇది ఇంతే!" అని కిలకిలా నవ్వేస్తుంది. తను కథ చెప్పేరోజు సాయంత్రం నా చేత వంట చేయిస్తుంది. పూలు గుచ్చుకుంటూ నన్ను ఒక్కొక్క పువ్వే అందించమంటుంది. మరేం చేస్తా? చచ్చినట్లు చేస్తా.

ఏ మాటకామాటే చెప్పాలి. మా ఆవిడ గొంతు బాగుంటుంది. పెళ్ళికాక ముందు అది సంగీత సాధనకూడా చేసింది. సినిమా పాటలు చక్కగా పాడుతుంది. తను సినిమాకథ చెప్పుతున్నప్పుడు పాటలు పాడే సన్నివేశం వచ్చినప్పుడు తను ఆ పాట పాడి వినిపించేవరకు గొడవచేస్తాను. తన శ్రావ్యమైన కంఠంతో గలగలా మాట్లాడుతున్నప్పుడు వినటానికి ఎంతో ముచ్చటగా వుంటుంది. మా ఆవిడ మాట్లాడుతుంటే రిథమిటిక్‌గా వుంటుంది; సంగీతం వింటున్నట్లుగా వుంటుంది. చీకటి గదిలో, కిటికీలోంచి పడే లేతవెన్నెల సన్నటి చారికలను చూస్తూ, మా ఆవిడ మధుర కంఠం పలికే మాటలు వినటం ఒక తియ్యటి అనుభవం. అందుకే, ఎక్కువసార్లు మా ఆవిడ్నే సినిమాకు

పంపిస్తూవుంటాను. ఇరుగుపొరుగమ్మలతో అర్థ పైసల మ్యాట్నీ సిన్మాకెళ్ళి వస్తుంది. ఆ సిన్మా కథలన్నీ నేను చెప్పించుకుంటాను. ఒక్కొక్కసారి ఆ సిన్మాను అంతకుముందే చూచివుంటాను. మా ఆవిడచేత కథంతా చెప్పించుకున్నాక చివర్లో మెల్లగా ఈ విషయం బయటపెట్టుతా. అప్పుడామె కోపం చూడాలి. నా బుగ్గలు రెండూ పిండి పెట్టుతుంది. ఉక్రోషంతో చాప వేసుకుని క్రింద పడుకుంటుంది. ఆ ఉక్రోషం చూస్తే నాకు బలే సరదా!

మా పెద్ద వెధవ చూచిన సిన్మాకథ వాడిచేత చెప్పించుకోవటానికి మేం యిద్దరం వాణ్ని రకరకాలుగా కాకా పట్టవల్సి వస్తుంది. పెద్ద పోజు పెట్టేస్తాడు. పిలిస్తే పలకడు. సీరియస్‌గా చూస్తాడు. ఎలాగో పట్టుకుని యిద్దరమూ బతిమాలుతాం. పది పైసలు లంచం అడుగుతాడు, లేకపోతే వాడికిష్టమైన వేరుశనగపప్పు పాకంచేసి పెట్టమంటాడు. నా బాల్ పాయింట్ పెన్ ఇవ్వమంటాడు.

అయ్యా, ఇంతకీ చెప్పవచ్చిందేమిటంటే — ఈ బ్లడీ మిడిల్‌క్లాస్ ఫామిలీస్‌లో ఎన్నో రకాల ఎడ్జస్ట్‌మెంట్స్. అందులో ఈ సిన్మా ఎడ్జస్ట్‌మెంట్ ఒకటి. ఈ ఎడ్జస్ట్‌మెంట్ కూడా ఒక తియ్యటి అనుభవాన్ని ప్రసాదిస్తుంది. వున్న యిద్దరు వెధవల్నీ చెరో ప్రక్క వేసుకొని, చీకటింట్లో, ముచ్చటగా సిన్మా ముచ్చట్లాడుకుంటూ, కిటికీలోంచి కనిపించే అరచెక్క ఆకాశాన్నీ, లేత వెన్నెలలో తమాషాగా కదుల్తుండే కొబ్బరాకుల్నీ చూస్తూ, నా చుట్టూ అల్లుకుని, నా గుండెలమీద తల పెట్టుకుని, నాకు అనిర్వచనీయమైన స్వర్గానందాని ప్రసాదిస్తూ, నా గుండెలు సేద తీరేటట్లుగా మధ్య మధ్యలో గలగలా, కిలకిలా నవ్వుతుండే అర్థాంగి — ఓహో, చాల తృప్తిగా వుంటుంది; చాల మధురమైన సన్నివేశం. మిడిల్‌క్లాస్ లైఫ్ అవుతేనేం. దేశంలో ఎంతమంది స్వార్థపరులు ఎన్నిరకాలుగా ఎన్ని తలకాయలు మార్చి గొప్పవాళ్ళయిపోతున్నా, ఈ వర్గాన్ని పైకి రానీయకుండా ఎక్కడికక్కడ, ఎవరికందిన చోటల్లా, ఎవరికి వారు దగా జేస్తోన్నా మాది గొర్రెతోక బతుకే అయినా, ఒక కాలు విరిగిన కుర్చీ అయినా, ఒక తాసు తెగిన వుట్టే అయినా ఫర్వాలేదనిపించే ధీమానీ, అలౌకికానందాన్ని ప్రసాదించే మధుర సన్నివేశం అది! అది ఎవరికి వారు చెప్పుకునే వోదార్పు. ఇలాటి చెదురుమదురు మధుర సన్నివేశాలూ, వోదార్పులూ గనక లేకపోయినట్లయితే, ఈ గడ్డుబతుకు లీడ్చలేక ఎప్పుడో యింత విషం తాగి చచ్చి వుండేవాణ్ణి! మీరూ అంతే! అదిగో ఆయనా అంతే, ఇదిగో ఈయనా అంతే!

అవునో కాదో మీరే చెప్పాలి!